క్లుప్తంగా

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసుల పంపిణీ



పంపిణీ చేస్తున్న విజయమ్మ

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం, ముత్తగూడెం, ఆరెకోడు, చింతపల్లి, కొండాపురం గ్రామాలల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం కందాళ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సతీమణి కందాల విజయమ్మ వీటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బెల్లం ఉమా, జెడ్పీటీసీ సభ్యుడు వరప్రసాద్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఖమ్మం తరలిరావాలి



మాట్లాడుతున్న నెల్లూరి భద్రయ్య

నేలకొండపల్లి: ఆదివారం ఖమ్మంలో చేపట్టిన తెలంగాణ జనగర్జనసభతో ఖమ్మం జనసంద్రం కావాలని నాయకులు నెల్లూరి భద్రయ్య సూచించారు. పార్టీ స్థానిక కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా సమన్వయంతో సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. జన సమీకరణ ప్రతీ కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు లక్కం ఏడుకొండలు, వెంకన్న, గరిడేపల్లి రామారావు, లక్ష్మినారాయణ, రాధాకృష్ణమూర్తి, మాగం సైదులు, ఈవూరి శ్రీనివాసరెడ్డి, రంగయ్య, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

టీఈఏ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాలు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఈఏ) ఆధ్వర్యంలో ఆఫీస్ టూ ఆఫీస్ ఉద్యోగ చైతన్య కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, ప్రభాకరాచారి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం తీసుకురావాలని, వారికి కనీస వేతనం రూ.600 ఇవ్వాలని ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మలీదు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. 50 ఏళ్లు దాటిన కార్మికులకు ఐడీ కార్డులు ఇచ్చి రూ.10 వేల జీవన భృతి ఇవ్వాలన్నారు. వారి కుటుంబాలకు నాణ్యమైన విద్యా, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఆదిపురుష్
వినోద	స్పై
సాయిరాం	సామజవరగమన
ఆదిత్య	లవ్ యూ రామ
శ్రీనివాస	ఇండియానా జోనెస్
సుందర్	నారాయణ అండ్ కో

- ఖమ్మం గాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	94	బచ్చలికూర	2
వంకాయ	36		10
బెండకాయ	40	పాలకూర	3
పచ్చిమిర్చి	94		10
కాకర	56	చుక్కకూర	2
బీర	50		10
దొండ	38	తోటకూర	2
పొట్లకాయ	46		10
చిక్కుడు	86	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	20	మెంతికూర	5
క్యాలీఫ్లవర్	50		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	46		15
క్యారెట్	56	పుదీన	1
క్యాప్సికం	70		15

-ఖమ్మం వ్యవసాయం

త్వరగా పనులు పూర్తిచేయండి

- మెడికల్ కళాశాలలో పరిశీలించిన మంత్రులు హరీశ్, పువ్వాడ
- అనుకున్న సమయానికల్లా సిద్ధం చేయాలని ఆదేశం



మెడికల్ కళాశాల వైద్యులతో మంత్రులు, ప్రజాప్రతినిధులు

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుండి వంద సీట్లు భర్తీ చేసి బోధన ఆరంభించనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు వెల్లడించారు. ఈ మేరకు కళాశాల భవనాల ఆధునీకరణ, నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పోడు పట్టాల పంపిణీ కోసం జిల్లాకు వచ్చిన ఆయన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి మెడికల్ కళాశాల పనులు పరిశీలించారు. అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి సకాలంలో తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేయాలని కలెక్టర్, అధికారులకు సూచించారు. పాత కలెక్టరేట్ భవనం, ఆర్‌అండ్‌బీ కార్యాలయం కలుపుకుని ఎనిమిది ఎకరాల్లో పనులు చేస్తున్నట్లు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వివరించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది వంద సీట్ల భర్తీకి అనుమతి వచ్చినందున ఏర్పాట్లలో వేగం పెంచినట్లు తెలిపారు. కాగా, పనులు పూర్తి చేసి ఆవరణ అంతా మొక్కలు నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని హరీష్‌రావు అధికారులను ఆదేశించారు. అనంతరం మెడికల్ కళాశాలకు కేటాయించిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మంత్రులు గ్రూప్‌ఫొటో దిగారు. ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యే రాములునాయక్, సీపీ విష్ణు ఎస్.వారియర్, ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రు, మేయర్ పునుకొల్లు నీరజ, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రాజేశ్వరరావు, సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్‌ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వద్దిరాజు యువసేన ఆధ్వర్యంలో సన్మానం..



మంత్రులు హరీష్‌రావు, పువ్వాడను సన్మానిస్తున్న వద్దిరాజు యువసేన బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమానికి జిల్లాకు వచ్చిన వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి టి.హరీష్‌రావును వద్దిరాజు రవిచంద్ర యువసేన సభ్యులు భారీ గజమాలతో సన్మానించారు. స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో తమ అభిమాన నాయకుడు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సమక్షంలో మంత్రి హరీష్‌రావుతో పాటు జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌లను సన్మానించారు. యువసేన సభ్యులు నానబాల హరీష్, రాపర్తి రాజా, వెంపటి ఉపేందర్, గోలెపు గణేష్, బోయిన కార్తీక్, జక్కుల రాజేష్, బి.తరుణ్, అరుణ్ నాయక్ పాల్గొన్నారు.

అదునుకు అండగా.. రైతుబంధు!

- పాలేరు డివిజన్‌లో 6.45 లక్షల మందికి పెట్టుబడి సాయం
- సకాలంలో అందుతుండడంపై అన్నదాతల హర్షం



అనంతనగర్‌లో చెరుకు సాగు పంట

నేలకొండపల్లి: వానాకాలానికి సంబంధించిన పెట్టుబడి సాయంగా రైతుబంధు పథకం నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతోంది. ఈ సారి వానలు ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడు సాగు పనులు మొదలవుతున్నాయి. ఈ నేపథ్యాన ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసేందుకు పెట్టుబడి అవసరం ఉంటుంది. ఇంతలోనే గత సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం సాయం జమ చేస్తోంది. ఎకరం నుంచి మొదలు అంతకు పైగా భూమి ఉన్న రైతులకు ప్రాధాన్యతా క్రమంలో నగదు ఖాతాల్లో జమ చేస్తున్నారు. అదునుపై పెట్టుబడి సాయం అందుతుండడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పాలేరులో వరి ప్రధానం

పాలేరు నియోజకవర్గంలో ప్రధానంగా వరి సాగు ప్రధాన పంట సాగవుతోంది. అలాగే, పత్తి, చెరుకు, కందులు, మొక్కజొన్న, మిర్చి ఇతర పంటలు కూడా సాగు చేస్తారు. బోరు బావులు, పాలేరు పాత కాల్వ, సాగర్ కెనాల్ కింద ఆయకట్టుల ఏటా రెండు పంటలు సాగవుతున్నాయి. నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో రైతులు వానాకాలం సీజన్ పంటలు సాగుకు శ్రీకారం చుట్టారు. గతంలో సాగు అవసరాల కోసం ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పు చేసే వారు. కానీ ఈసారీ రైతులకు ఇబ్బందులు లేకుండా సాగు సమయంలో పెట్టుబడి సాయంగా రైతుబంధు నగదు వస్తుండడంతో ఆనందంగా పనుల్లో నిమగ్నమయ్యారు.

పెరిగిన రైతుల సంఖ్య..

గత యాసంగిలో పాలేరు డివిజన్‌లో 6,44,523 మంది రైతులకు పెట్టుబడి సాయం అందింది. ఎకరానికి రూ.5వేల చొప్పున నగదు ఖాతాల్లో అయింది. అయితే, ఈ సీజన్‌లో రైతుబంధు అర్హుల సంఖ్య పెరిగింది. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన రైతులకు పేర్ల నమోదుకు అవకాశం కల్పించారు. దీంతో వారు ఏఈఓలకు వివరాలు అందజేయగా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఫలితంగా వీరికి కూడా పెట్టుబడి సాయం అందుతోంది.

సాగు సమయానికి ఇవ్వడం సంతోషం



సాగు సమయానికి ప్రభుత్వం పెట్టుబడి అందించటం సంతోషంగా ఉంది. పెట్టుబడి సాయం ఆలస్యమైతే రైతులు పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వం గ్రహించింది. అందుకే ఈసారి సరైన సమయానికే రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నారు.

– నెల్లూరి లీలాప్రసాద్, సీడీసీ చైర్మన్, నేలకొండపల్లి

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



పాలేరు డివిజన్‌లో పట్టాదారు పాస్‌పుస్తకం కలిగిన ప్రతీ రైతుకు పెట్టుబడి సాయం అందేలా చూస్తున్నాం. కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు కూడా దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

నాణ్యమైన విత్తనాలే అమ్మాలి..



రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ

కూసుమంచి: రైతులకు నాణ్యమైన విత్తనాలు అమ్మడంతో పాటు వారికి తగు రశీదులు తప్పకుండా ఇవ్వాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర అన్నారు. కూసుమంచి, పాలేరు గ్రామాల్లోని విత్తన, పురుగుమందుల దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీలర్లు అందరూ తప్పనిసరి స్టాక్ బోర్డులను అప్‌డేట్ చేయాలని, పురుగు మందుల పీసీ కాపీలను రికార్డుల్లో జత చేసుకోవాలని సూచించారు. పీసీలు లేని కంపెనీల పురుగు మందులు విక్రయించొద్దని లేనిఎడల తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ తనిఖీల్లో ఏఓ వాణి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో సత్తా చాటుతున్న మనుశ్రీ



మనుశ్రీని సన్మానిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్: అథ్లెటిక్స్ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలనే తపనతో ఖమ్మంకు చెందిన మనుశ్రీ కృషి చేస్తోంది. సీనియర్ అథ్లెటిక్స్ కోచ్ ఎం.డీ.గౌస్ వద్ద ఎనిమిదేళ్ల నుంచి రన్నింగ్‌లో శిక్షణ తీసుకుంటుండగా, రెండేళ్ల నుంచి రాష్ట్రస్థాయి పోటీల్లో విజయాలు సొంతమవుతున్నాయి. తాజాగా పాట్నాలో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి భోపాల్‌లో జరుగుతున్న జాతీయ జట్టు శిక్షణ శిబిరానికి ఎంపికైంది. జిల్లా నుంచి ఈ పోటీలకు ఎంపిక కావడం మొదటి అథ్లెట్ మనుశ్రీ కావడంతో ఆమెను శుక్రవారం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.డీ.షఫీక్ అహ్మద్ అభినందించారు.

రాజకీయాలకతీతంగా 'తెలంగాణ వికాస సమితి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: రాజకీయాలకు అతీతంగా తెలంగాణ వికాస సమితి పనిచేస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాష్ట్ర కమిటీ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష చేస్తూ ప్రజలకు మేలు జరిగే విధంగా సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు దారా సత్యానంద్, ప్రధాన కార్యదర్శి కోటేశ్వరావు, ఉపాధ్యక్షుడు రాజారావు, సంయుక్త కార్యదర్శి రవీందర్, మల్లేశంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిలు నిర్మించాలని గ్రామస్తుల ఆందోళన



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు పెద్ద చెరువు, రెడ్డికుంట చెరువుల అలుగుల వద్ద బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కోరుతూ శుక్రవారం గ్రామస్తులు రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెరువుల, అలుగుల వద్ద నుంచి రైతులు పంట పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తిమ్మిడి హన్మంతరావు, వెంకటరమణ, గొర్రెపాటి దర్గయ్య, శ్రీనివాసరావు, నాగమణి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు–4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షిస్తున్న అధికారులు

నేలకొండపల్లి: నేడు జరగనున్న గ్రూపు–4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కేంద్రాలను 240 మంది అభ్యర్థులను కేటాయించగా అందుకు తగ్గట్టుగా సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక కేంద్రంలో ఏర్పాట్లను శుక్రవారం కేంద్రం లైజినింగ్ అధికారి మిస్సక్, రూట్ ఆఫీసర్ పుష్పలత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.... అభ్యర్థులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

రఘునాథపాలెం: అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సీపీఎం నాయకుడు యర్రా శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని పుటానీతండా గ్రామంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి.. ఇప్పుడు గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షలే మంజూరు చేస్తానని చెప్పడం సరికాదన్నారు. గృహలక్ష్మి ద్వారా కేంద్రంతో కలిపి రూ.15లక్షలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డితో పాటు నాయకులు యర్రా శ్రీనివాస్, బానోత్ నాగేశ్వరరావు, గుగులోత్ హరినాయక్, సక్కుబాయ్, వెంకటేశ్వరరావు, షేక్ ఇమాం, గుగులోత్ కుమార్, కూచిపూడి నరేష్, పఠాన్ రహీంఖాన్, మంగ, వల్లూరు శ్రీనివాస్, నల్లమోతు నాగయ్య, రవీందర్, షరీఫ్, అబ్దుల్ పాల్గొన్నారు.

'పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న కేంద్రం'

ఖమ్మం రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను విస్మరించి బడా పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని సీపీఎం నాయకులు బండా రమేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డు వద్ద తమ్మినేని సుబ్బయ్య స్మారక భవనంలో జరిగిన రాజకీయ శిక్షణా కార్యక్రమంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను పెట్టుబడిదారులకు దారాదత్తం చేస్తుందని, ప్రభుత్వ ఆస్తులను ప్రైయివేటు పరం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రఫీ, సుదర్శన్‌రెడ్డి, నంద్ర ప్రసాద్, సంగయ్య, మోహన్‌రావు, నర్సింహరావు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో వైద్యం అందించాలి



మాట్లాడుతున్న కృష్ణారావు

ఖమ్మం మామిళ్లగూడెం: పేదలకు అతితక్కువ ఖర్చుతో వైద్యం అందించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజాసంఘాల చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు, కన్వీనర్ గుంతేటి వీరభద్రం అన్నారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ బీపీఎస్ చంద్రరాయ్‌కు గౌరవ సూచికంగా ఆయన జన్మదినం నాడు జాతీయ వైద్యుల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. వైద్యం వ్యాపారమైన సందర్భంలో ఆయనను స్ఫూర్తిగా తీసుకొని పేద ప్రజలకు సేవ చేస్తే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్టే అన్నారు. ఈ సమావేశంలో కో కన్వీనర్ వెంకటరమణ, సోమరాజ్, పద్మాచారి, నరేందర్, మస్తాన్, శ్రీనివాస్, ప్రభాకర్, రామారావు, ఆంజనేయులు, రామకృష్ణ, గాదరిబాబు, వెంకటేశ్వర్లు, రాము నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ ఆలయంలో 'అవదూత'



భక్తులతో మాట్లాడుతున్న అవదూత విజయానంద తీర్థ స్వామి

ఖమ్మంగాంధీచౌక్: కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్‌కు చెందిన దత్తపీఠ ఉత్తరాధికారి అవదూత విజయానంద తీర్థ స్వామి శుక్రవారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలోని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అనుగ్రహం, భాషణం, ఆశీస్సులు అందించారు. ఈ కార్యక్రమంలో గోవిందరావు, నర్సింహారావు, ఈశ్వరరావు, హనుమంతు, వరలక్ష్మీ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన ధరలు తగ్గించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకురాలు

ఖమ్మం సహకారనగర్: పెరిగిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు సునీతరావు మాట్లాడుతూ...టీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో మహిళలు ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. మహిళా విభాగం అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, పుష్ప, దివ్య, జ్యోతి, రజిని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథుడి నగర సంకీర్తన



ఊరేగింపులో భక్తులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గురుపౌర్ణమి సందర్భంగా నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న శ్రీ వరప్రదాత షిర్డీ సాయినాథుడికి నగర సంకీర్తన శుక్రవారం అంగరంగ వైభవంగా సాగింది. రంగు రంగుల విద్యుత్తు దీపాల నడుమ మహిళల కోలాటాలు, భిన్నమైన వేషధారణలతో, వివిధ విన్యాసాలతో సాయినాథుని నగర సంకీర్తన సాగింది. నిర్వాహకులు రూ. 3 లక్షల నోట్లతో అలంకరించి కనకాభిషేకం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ వములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు, భద్రాద్రి బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, మాజీ అధ్యక్షులు కొప్పు నరేష్, పసుమర్తి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులపై దాడులకు నిరసన



నిరసన తెలుపుతున్న పాస్టర్లు

ఖమ్మంగాంధీచౌక్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు, మందిరాలను కూల్చివేయటాన్ని నిరసిస్తూ ఖమ్మం పట్టణ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో దైవజనులు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఖమ్మం పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపకులు పాస్టర్‌ముల సత్యం, అధ్యక్షుడు ఎస్.శ్యామ్యోల్, కార్యదర్శి గుండు వేణు, మోజెస్, ఎం.రాజు, సీహెచ్.డ్యానియోల్, రాధాకృష్ణ, మందా తిమోతీ, కొత్తపల్లి ఇశాక్, సాల్మన్ రాజు, రామారావు, జోసెఫ్ రామారావు, చిన్న డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇదండీ కాంట్రాక్టర్ల తీరు..



నిజాంపేట వద్ద డ్రెయినేజీపై దెబ్బతిన్న రోడ్డు



బ్యాంక్ కాలనీలో కుంగిన రోడ్డు

కేఎంసీ పరిధిలో పలు అభివృద్ధి, మరమ్మతు పనులు దక్కించుకుంటున్న కాంట్రాక్టర్లు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని నిజాంపేటలో డ్రెయిన్‌పై ఏటవాలుగా రోడ్డు నిర్మించడంతో డ్రెయిన్‌పై రోడ్డు దెబ్బతిని సువ్వలు తేలాయి. దీంతో ఇక్కడ కాంట్రాక్టర్ ప్యాచ్ వర్క్ చేశారు. కానీ తూతూమంత్రంగా తారు పోసి వదిలేయడంతో కొన్నిరోజులకే మళ్లీ ఇదిగో ఇలా యథాస్థితికి చేరింది. ఇక బ్యాంక్ కాలనీలో కృష్ణ ఫంక్షన్ హాల్ పక్కన మెయిన్‌రోడ్డుకు అనుసంధానంగా ఉన్న రోడ్డు డ్రెయినేజీ వద్ద బీటలు వారింది. ఇక్కడ కేవలం తారు పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకలతో మళ్లీ కుంగిపోయి ఇదిలో ఇలా ప్రమాదంగా మారింది.

– ఖమ్మం మయూరిసెంటర్